క్లుప్తంగా

గుట్కా ప్యాకెట్ల స్వాధీనం



ఆత్మకూరు : మండలంలోని అక్కంపేటలో గల జనరల్ స్టోర్‌లో అక్రమంగా నిల్వచేసిన గుట్కా ప్యాకెట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీఐ సంతోశ్ తెలిపిన వివరాల ప్రకారం.. అక్కంపేటకు చెందిన మొయినుద్దీన్ జనరల్ స్టోర్‌లో రూ.7,948 విలువచేసే గుట్కా ప్యాకెట్లను అక్రమంగా నిల్వ చేసినట్లు సమాచారం వచ్చిందన్నారు. దీంతో పోలీస్ సిబ్బంది దాడులు నిర్వహించి గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని మొయినుద్దీన్‌పై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు.

కమలాపూర్ : మండలంలోని శ్రీరాములపల్లికి చెందిన దేవులపల్లి కోటేశ్వర్, గూడూరుకు చెందిన పిల్లల లక్ష్మీకి చెందిన కిరాణాల్లో రూ.4 వేల విలువచేసే గుట్కా ప్యాకెట్లను పట్టుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ బుధవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీరాములపల్లి, గూడూరు గ్రామాల్లో గుట్కా ప్యాకెట్లు విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో కోటేశ్వర్, లక్ష్మీకి చెందిన రెండు కిరాణా దుకాణాల్లో మొత్తం రూ.4 వేల విలువ చేసే గుట్కాలు స్వాధీనం చేసుకుని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

నడికూడ : మండల కేంద్రానికి చెందిన తోర్నే శంకర్‌రావు, నెమరుగొమ్ముల లక్ష్మణ్ రావు ఇటీవల మృతిచెందారు. బుధవారం పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఆత్మకూరు : మండల కేంద్రంలో బుధవారం రేవూరి నరసింహారెడ్డి మృతిచెందగా ఆయన కుమారుడు బీఆర్‌ఎస్ నాయకుడు ప్రభాకర్‌రెడ్డితో పాటు ఆయన కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పరామర్శించారు. బీఆర్‌ఎస్ నాయకులు పాపని రవీందర్, రేవూరి సుధాకర్‌రెడ్డి అంకూస్, భగవాన్ రెడ్డి పాల్గొన్నారు.

గీసుకొండలో..

గీసుకొండ : వరంగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, బీఆర్‌ఎస్ నాయకుడు చింతం సదానందం తల్లి వెంకటలక్ష్మి ఇటీవల మృతి చెందగా బుధవారం మొగిలిచర్లలోని వారి స్వగృహంలో తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం మాజీ ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు ముద్దసాని సహోదర్‌రెడ్డిలు పరామర్శించారు. ఈ సందర్భంగా వెంకటలక్ష్మి చిత్రపటానికి పూల మాలు వేసి నివాళులర్పించారు. వారి వెంట బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

వాటర్‌కూలర్ బహూకరణ



నర్సంపేట రూరల్ : పట్టణంలోని జిల్లా పరిషత్ సెకండరీ (బాలుర) పాఠశాల విద్యార్థులకు రాబోయే వేసవి కాలంలో చల్లని నీరు తాగేందుకు రూ. 25వేల విలువ చేసే వాటర్ కూలర్‌ను చెన్నారావుపేటకు చెందిన గాదెగోని సదయ్య జ్ఞాపకార్థం వారి కుమారులు రాజు-సంధ్య దంపతులు స్కూల్ హెచ్‌ఎం, ఎంఈఓ కొర్ర సారయ్యకు బుధవారం అందించారు. ఈ సందర్భంగా సారయ్య మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదివి గొప్పవారు కావాలని, పాఠశాలకు మంచిపేరు తీసుకురావాలన్నారు. వాటర్ కూలర్‌ను అందించిన రాజును అభినందించారు.కార్యక్రమంలో వైభవ్‌శ్రీనివాస్, వైష్ణవ్‌శ్రీరాం, చిరంజీవి, విక్రమ్, నవీన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమంగా నిల్వ చేస్తే చర్యలు

నల్లబెల్లి : అనుమతులు లేకుండా ఇసుక తరలించినా, నిల్వ చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై గోవర్ధన్ అన్నారు. పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలో ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేకంగా పోలీస్ టీం ఏర్పాటు చేశామని అన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు లేకుండా వేర్వేరు ప్రాంతాల నుంచి ఇసుకను తరలించే వారిపై, అక్రమంగా నిల్వ చేసేవారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఇసుక అక్రమ రవాణా సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

ఆర్థిక అంశాలపై అవగాహన

పర్వతగిరి : స్థానిక సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలో గవర్నమెంట్ ఆఫ్ ఇండియా పీఎంశ్రీ యోజన ఫేస్-2లో భాగంగా ప్రిన్సిపాల్ పి.అపర్ణ, పంజాబ్ నేషనల్ బ్యాంకు మేనేజర్ ఎల్.జనార్ధన్, అసిస్టెంట్ మేనేజర్ కె.తిరుపతి విద్యార్థినులకు అవగాహన కల్పించారు. విద్యార్థులకు బేసిక్స్ ఆఫ్ బ్యాంకింగ్, సేవింగ్స్, డిజిటల్ అంశాలు, యూపీఏ అవేర్‌నెస్, స్మార్ట్ బడ్జెట్‌ప్లానింగ్, అండర్‌స్టాండింగ్ లోన్స్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్స్‌పై అవగాహన కల్పించారు.

సార్ల చొరవతో వినియోగంలోకి..



భవనం చుట్టూ పెరిగిన చెట్లు, ముళ్లపొదలు



వినియోగంలోకి తీసుకొచ్చిన భవనం ఇదే..

- శిథిలావస్థలో ఉన్న భవనానికి మరమ్మతు
- వినియోగంలోకి భవనం
- అబ్దుల్ కలాం టీచింగ్, లెర్నింగ్ సెంటర్‌గా నామకరణం
- అభినందిస్తున్న విద్యావంతులు

ధర్మసాగర్ : విద్యార్థులకు పాఠాలు బోధించే ఉపాధ్యాయులు తలోచేయి వేసి స్వంత డబ్బుతో శిథిలావస్థకు చేరుకున్న భవనానికి మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకుకొచ్చారు. కిటికీలు, తలుపులు ఇతర మౌళిక వసతులు కల్పించి ఆ భవనానికి రంగులు అద్దారు. అనంతరం ఏపీజే అబ్దుల్ కలాం టీచింగ్, లెర్నింగ్ సెంటర్‌గా నామకరణం చేసి విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించేందుకు సిద్ధం చేస్తున్నారు.

ఎంఈఓ ప్రత్యేక దృష్టి

పాఠశాలల పర్యవేక్షణలో భాగంగా ఎంఈఓ డాక్టర్ రాంధన్ ఇటీవల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ క్రమంలో పాఠశాల ప్రాంగణం వెనుక భాగంలో ఓ భవనం కనిపించింది. దాని చుట్టూ దట్టంగా అడవిని తలపించే విధంగా పెద్ద చెట్ల, ముళ్లపొదలు ఉన్నాయి. దీంతో పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం ధర్మప్రకాశ్ సహాయంతో ముళ్లచెట్లను తొలగించారు. భవన తలుపులు, కిటికీలు చెదలు పట్టి ఉండడం గమనించారు. కానీ భవనం మాత్రం చెక్కు చెదరకుండా ఉందని దీన్ని ఎలాగైనా వినియోగంలోకి తీసుకురావాలని ఇన్‌చార్జ్ హెచ్‌ఎంతో చర్చించారు. ఈ మేరకు మండల విద్యాధికారి డాక్టర్ రాంధన్ తన సొంత డబ్బులు రూ.30 వేలకు పైగా వెచ్చించి భవనం చుట్టూ పరిసరాలు శుభ్రం చేయించారు. అదే విధంగా భవనం గదులకు ఇనుప తలుపులు, ఇతరత్రా మరమ్మతులు చేపించి నెల రోజుల్లోనే భవనాన్ని వినియోగంలోకి తీసుకువచ్చారు. మండల విద్యాధికారి పనితీరుకు స్పందించిన మండలంలోని పెద్దపెండ్యాల ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం చాడ మల్లారెడ్డి, తాటికాయల ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం బొద్దిరెడ్డి వెంకటేశ్వర్‌రెడ్డి తమ వంతు సహాయంగా సుమారు రూ.25 వేల సొంత డబ్బులతో 50 కుర్చీలు, మూడు ఫ్యాన్లు, బోర్డు, స్టాండు, టేబుల్ తదితర సామగ్రిని కొనుగోలు చేసి అందించారు.

ఏపీజే అబ్దుల్ కలాం టీచింగ్, లెర్నింగ్ సెంటర్‌గా నామకరణం

ఈ భవనానికి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం టీచింగ్, లెర్నింగ్ సెంటర్ ధర్మసాగర్‌గా నామకరణం చేశారు. రాబోవు రోజుల్లో ఉపాధ్యాయులకు శిక్షణలు, సమావేశాలు విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించేందుకు కార్యాచరణ చేయనున్నట్లు వారు తెలిపారు. మండల విద్యాధికారి, ఉపాధ్యాయులు కలిసి నిరుపయోగంగా ఉన్న భవనాన్ని ఉపయోగంలోకి తీసుకురావడంపై అధికారులు, విద్యాభిమానులు, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మెరుగైన విద్యనందించడమే ధ్యేయం



మండలంలోని విద్యార్థులకు మెరుగైన విద్య అందించడమే ధ్యేయంగా పని చేస్తున్నాం. మండల కేంద్రంలోని వివిధ పాఠశాలల విద్యార్థులతో పాటు వివిధ గ్రామాల్లో గల పాఠశాలల విద్యార్థులకు విద్యా సౌకర్యాలు, మౌలిక సదుపాయాలతో మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో మండల విద్యాధికారి ప్రోత్సాహంతో టీచింగ్, లెర్నింగ్ సెంటర్ ప్రారంభించడం సంతోషకరంగా ఉంది. విద్యా పరంగా వినియోగించుకునేందుకు ఈ సెంటర్ చాలా ఉపయోగపడుతుంది.

– ధర్మప్రకాశ్, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం

అగ్రంపహాడ్‌లో భక్తుల సందడి



గద్దెల వద్ద పూజారులు



మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

ఆత్మకూరు : మండలంలోని అగ్రంపహాడ్‌లో సమ్మక్క-సారలమ్మ మినీ జాతర బుధవారం వైభవంగా జరిగింది. సమ్మక్క-సారలమ్మ గద్దెల వద్ద భక్తులు బంగారం, ఒడిబియ్యం, పసుపు, కుంకుమ సమర్పించారు. అలాగే చౌడాలమ్మ తల్లి వద్ద మొక్కులు చెల్లించుకున్నారు. పిల్లాపాపలను, పాడిపంటలను చల్లగా చూడమని తల్లులను వేడుకున్నారు. అధికారులు భక్తులకు ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు మాదాసి శ్రీధర్ జాతరలో అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పూజారులు సంప్రదాయబద్ధంగా తల్లుల గద్దె వద్ద పూజలు నిర్వహించారు. ఆదివారం వరకు మినీ జాతర జరుగుతుందని, భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి తల్లులను దర్శించుకోవాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

రక్షణకు దోమ తెరలు వాడాలి



దుగ్గొండి: దోమల నుంచి రక్షణ పొందడానికి దోమ తెరలు వాడటంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల వైద్యాధికారి కిరణ్‌రాజు అన్నారు. మండలంలోని నారాయణతండాలో ఓ వ్యక్తికి డెంగీ నిర్ధారణ కావడంతో ఆయన బుధవారం గ్రామంలో పర్యటించారు. జ్వర బాధితుల వివరాలు సేకరించారు. 60 ఇళ్లలో ప్రత్యేక మలేరియా అధికారి నందా పర్యవేక్షణలో దోమల మందు పిచికారీ చేయించారు. అనంతరం జ్వరాల నుంచి రక్షణ పొందడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. డాక్టర్ భరత్, హెచ్‌ఈఓ సాంబయ్య, సీహెచ్‌ఓ సలోమి, పీహెచ్‌ఎన్ మనోజ, హెల్త్ అసిస్టెంట్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంజేపీ విద్యార్థుల క్షేత్ర పర్యటన



వేయి స్తంభాల గుడిని సందర్శించిన విద్యార్థులు

శాయంపేట : మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులు బుధవారం వరంగల్‌లోని వ్యవసాయ కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వ్యవసాయ కళాశాలలోని వివిధ రకాల వ్యవసాయ పంటల గురించి శాస్త్రవేత్తలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం హనుమకొండలోని జంతుప్రదర్శనశాల, వేయి స్తంభాల గుడి, వరంగల్‌లోని కాకతీయుల కోటను సందర్శించారు. పాఠశాల ప్రిన్సిపాల్ రేవతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించాలి



ఖానాపురం : గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు దాతలు సహకరించాలని ఎస్సై చాగర్ల రఘుపతి అన్నారు. మండలంలోని అశోక్‌నగర్‌లో దాతల సహకారంతో సోలార్ సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటు అవసరమన్నారు. ప్రతీ గ్రామంలో ఏర్పాటు చేసుకోవడానికి దాతలు సహకరించాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

వివాహిత అదృశ్యం



కమలాపూర్ : స్థానిక పోలీస్ స్టేషన్‌లో బుధవారం మిస్సింగ్ కేసు నమోదు అయ్యింది. ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. సంగెం మండలం పల్లారుగూడకు చెందిన మహేందర్ మండల కేంద్రంలో నివాసముంటూ ఓ గ్రానైట్ కంపెనీలో జేసీబీ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో అతడి భార్య పోడేటి సుకన్య (30) భర్తతో గొడవపడి ఇంట్లో నుంచి ఈనెల 10న తన ముగ్గురు పిల్లలతో సహా వెళ్లిపోయింది. బంధువుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. భర్త మహేందర్ ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

బీజేపీలో చేరిన మహిళ న్యాయవాది



పరకాల : పట్టణానికి చెందిన మహిళ న్యాయవాది వేముల సంధ్యారాణి బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కొండేటి శ్రీధర్, శ్రీరాములు సమక్షంలో బుధవారం బీజేపీలో చేరారు. పట్టణంలో పార్టీ బలోపేతానికి కృషిచేస్తానని ఆమె తెలిపారు. పట్టణ అధ్యక్షుడు నిరంజన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గురుప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ జయంత్‌లాల్, పట్టణ మాజీ అధ్యక్షుడు భిక్షపతి, విజయ్, సోమరాజు పాల్గొన్నారు.

అర్చక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా మాధవ మూర్తి



ఆత్మకూరు : హనుమకొండ జిల్లా ధూపదీప నైవేద్య అర్చక జిల్లా ప్రధాన కార్యదర్శిగా మండల కేంద్రానికి చెందిన శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ అర్చకుడు ఆరుట్ల మాధవ మూర్తి ఎన్నికయ్యారు. హనుమకొండలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు వాసుదేవశర్మ ఎన్నికను ప్రకటించారు. అర్చకుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

బెల్టుషాపులను అరికట్టాలి



ఐనవోలు : గ్రామాల్లో విచ్చల విడిగా వెలసిన బెల్టుషాపులను అరికట్టాలని సామాజిక కార్యకర్త రాజారపు రాజ్‌కుమార్ కోరారు. ఈ మేరకు బుధవారం ఎక్సైజ్ ఎస్సై రమాదేవికి బుధవారం వినతిపత్రం అందించారు. వెంటనే చర్యలు చేపట్టాలని కోరారు.

ఆరోగ్య సమావేశాలు నిర్వహించాలి

చెన్నారావుపేట: గ్రామాల్లో ఆరోగ్య సమావేశాలు నిర్వహించాలని ఏపీఎం ఈశ్వర్ అన్నారు. స్థానిక గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ, ఆశాజ్యోతి మండల సమాఖ్య కార్యాలయంలో బుధవారం మానవ అభివృద్ధి సూచికలపై రెండో రోజు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పది గ్రామాల్లోని సంఘాల ప్రతినిధులకు, వీఓఏలకు, శిక్షణ ఇచ్చామన్నారు. మహిళా సంఘాల ద్వారా ఆర్థికంగా అభివృద్ధిని సాధించినప్పటికి, సాధించిన ఆర్థిక ఫలాల్లో ఎక్కువ శాతం అనారోగ్యాలకు, వైద్య ఖర్చులకు వినియోగిస్తున్నారని, ఆరోగ్యంపై అందరూ అవగాహన కలిగి ఉండాలన్నారు.

ఘనంగా ఎల్లమ్మ పండుగ



ఐనవోలు : మండల కేంద్రంలోని మల్లికార్జునస్వామి ఆలయ ప్రాంగణంలో గల ఎల్లమ్మ దేవాలయంలో మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని ఎల్లమ్మ పండుగను బుధవారం అర్చకులు ఘనంగా జరిపించారు. ఈ సందర్భంగా అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించి నూతన వస్త్రాలంకరణ చేశారు. అనంతరం సహస్ర కుంకుమార్చన చేసి మహా నివేదన, నీరాజన మంత్ర పుష్పం, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలు జరిపించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉప ప్రధాన అర్చకుడు రవీందర్, ముఖ్య అర్చకులు పాతర్లపాటి శ్రీనివాస్, ఐనవోలు మధుకర్ శర్మ, వేద పండితులు గట్టు పురుషోత్తంశర్మ, విక్రాంత్ వినాయక్ జోషి, అర్చకులు నందనం భాను ప్రసాద్ శర్మ, నరేష్ శర్మ, అర్చక సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.

ఒకరిద్దరు పార్టీ మారితే నష్టమే లేదు



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

వేలేరు : ఒకరిద్దరు నాయకులు వారి స్వార్థ ప్రయోజనాల కోసం పార్టీ మారితే కాంగ్రెస్‌కు వచ్చే నష్టమేమి లేదని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కత్తి సంపత్ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మాజీ జెడ్పీటీసీ కీర్తి వెంకటేశ్వర్లు, మల్కిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి కోవర్టు రాజకీయాలు చేస్తూ పార్టీకి నష్టం కలిగించడంతో వారిని పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్లు వెల్లడించారు. ఇంకా ఎవరైనా పార్టీ నుంచి వెళ్లాలనుకుంటే వెళ్లొచ్చని, పార్టీకి నష్టమేమి లేదన్నారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి నియోజకవర్గ అభివృద్ధి కోసం పార్టీ మారినట్లు తెలిపారు. ఇప్పటి వరకు రూ.700 కోట్ల నిధులు తీసుకువచ్చి అభివృద్ధి పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఉప ఎన్నిక వచ్చినా మళ్లీ ఎమ్మెల్యేగా గెలిచేది కడియం శ్రీహరేనని అన్నారు. కడియం శ్రీహరి నియోజకవర్గానికి చేస్తున్న అభివృద్ధిని చూసి ప్రతిపక్ష నాయకులు విమర్శలు చేస్తున్నారని, స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరవేస్తామని అన్నారు. టీపీసీసీ మాజీ కార్యదర్శి సమ్మయ్య, మాజీ ఎంపీపీ సమ్మిరెడ్డి, మాజీ ఏఎంసీ వైస్‌చైర్మన్ రాంగోపాల్‌రెడ్డి, కుడా మాజీ డైరెక్టర్ బిల్లా యాదగిరి, మాజీ సర్పంచ్‌లు రాజిరెడ్డి, రాజమల్లయ్య, మాజీ ఉపసర్పంచ్ సద్దాం హుస్సేన్, మండల యూత్ అధ్యక్షుడు రణధీర్ రెడ్డి, నాయకులు లక్ష్మణ్ నాయక్, రవీందర్ యాదవ్, సంపత్, శ్రీకాంత్, పాల్గొన్నారు.

హైనాతో గొర్ల కాపరులు జాగ్రత్తగా ఉండాలి



మాట్లాడుతున్న లింగయ్య

ఐనవోలు : గొర్రెలు, మేకలు, మూగజీవాలపై హైనా దాడి చేసే ప్రమాదం ఉందని, గొర్ల కాపరులు అప్రమత్తంగా ఉండి మూగజీవాలను కాపాడుకోవాలని గొర్రెలు, మేకల పెంపకం దారుల సంఘం (జీఎంపీఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి కాడబోయిన లింగయ్య సూచించారు. బుధవారం మండల కేంద్రంలో జీఎంపీఎస్ మండల కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలోని గర్మిళ్లపల్లి గ్రామంలో ఇటీవల హైనా మూగజీవాలపై దాడి చేసి చంపివేసిందన్నారు. అడవుల్లో మంద పెట్టే సమయంలో గొర్ల కాపరులు అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు చేరాలు, మండల అధ్యక్ష, కార్యదర్శులు దయాకర్, చిన్నరాజు, రైతు సంఘం అధ్యక్షుడు నాగరాజు, నర్సయ్య, సంపత్ పాల్గొన్నారు.

విద్యతోపాటు వినయం అలవర్చుకోవాలి

- రిటైర్డ్ డీఎస్పీ దామెర నర్సయ్య



మాట్లాడుతున్న దామెర నర్సయ్య

కమలాపూర్ : పాఠశాలస్థాయి నుంచే విద్యార్థులు విద్యతో పాటు వినయం, చక్కటి సంస్కారం అలవర్చుకోవాలని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు, రిటైర్డ్ డీఎస్పీ దామెర నర్సయ్య సూచించారు. కమలాపూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, ఓరుగల్లు కన్స్యూమర్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన సంస్కార వికాస శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు తమ ఉజ్వల భవిష్యత్ కోసం విద్యపై ప్రత్యేక శ్రద్ధ వహించి మంచి అలవాట్లు, క్రమశిక్షణ కలిగి ఉండాలని అన్నారు. జీవితంలో ఉన్నతంగా ఎదగడానికి చక్కటి ప్రణాళికలతో ముందుకు సాగితే లక్ష్యాన్ని సులువుగా చేరుకుంటారన్నారు. ప్రతిఒక్కరూ వృద్ధులు, పెద్దలపై గౌరవభావం కలిగి ఉండాలన్నారు. సీడబ్ల్యూసీ సభ్యుడు, ఓరుగల్లు కన్స్యూమర్ ప్రొటెక్షన్ కౌన్సిల్ అధ్యక్షుడు కజాంపురం దామోదర్, సీనియర్ సిటిజన్స్ వేల్ఫేర్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి యుగేందర్, సభ్యులు రవీందర్‌గౌడ్, లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



స్వయంపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

దామెర : మండలంలోని ఒగ్లాపూర్‌లో గల డీస్నీ ల్యాండ్ ఉన్నత పాఠశాలలో బుధవారం స్వయంపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 50మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. మరి కొందరు విద్యార్థులు ముఖ్యమంత్రిగా, మంత్రులుగా, ఎమ్మెల్యేలుగా, వివిధ శాఖల అధికారులుగా వ్యవహరించారు. విద్యార్థుల్లో దాగిఉన్న ప్రతిభను, బోధన సామర్థ్యాన్ని వెలికితీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని పాఠశాల కరస్పాండెంట్ శోభారాణి తెలిపారు. ముఖ్యమంత్రిగా వ్యవహరించిన కార్తికేయ, ఎమ్మెల్యేగా వ్యవహరించిన వాసు, కలెక్టర్‌గా వ్యవహరించిన లక్ష్మీప్రసన్న, ఎంపీగా వ్యవహరించిన కావ్య, మంత్రిగా వ్యవహరించిన శ్రీజ, కరస్పాండెంట్‌గా వ్యవహరించిన ఎం.కావ్య, డీఈఓగా వ్యవహరించిన అక్షిత, ఎంఈఓగా వ్యవహరించిన సంజయ్, ప్రిన్సిపాల్‌గా వ్యవహరించిన వరుణ్‌ను పాఠశాల యజమాన్యం అభినందించి బహుమతులు అందించింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ముఖ్య సలహాదారులు దయ్యాల మల్లయ్య, సదయ్య, బాలుగు లక్ష్మీనివాసం, డైరెక్టర్లు రాకేశ్, భాను, దినేశ్‌చందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీసీ కాలనీని సందర్శించిన రెవెన్యూ అధికారులు



బీసీ కాలనీలో కబ్జాకు గురైన స్థలాలను చూపుతున్న కాలనీ వాసులు

కమలాపూర్ : మండల కేంద్రంలోని బీసీ కాలనీని రెవెన్యూ అధికారులు బుధవారం సందర్శించారు. 895 సర్వే నంబరులోని బీసీ కాలనీ (పద్మశాలీ)లకు కేటాయించిన ఇళ్ల స్థలాల ప్లాట్లను కొందరు కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఇటీవల పద్మశాలీలు జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, వరంగల్ పోలీస్ కమిషనర్‌కు ఇటీవల ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. కాగా కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు బీసీ కాలనీని సందర్శించి ప్లాట్లను, కబ్జాకు గురైన ప్లాట్లను పరిశీలించి వివరాలు సేకరించారు. బీసీ కాలనీకి కేటాయించిన స్థలానికి సంబంధించిన రికార్డులు పరిశీలించి హద్దులు నిర్ణయిస్తామని రెవెన్యూ అధికారులు తెలిపారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సమ్మయ్య, సర్వేయర్ గోపికృష్ణ, మాజీ ఎంపీటీసీ సభ్యుడు మార్గం భిక్షపతి, నాయకులు అరవింద్, మురళి, రాజు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

గ్రామకమిటీ ఎన్నిక

ఐనవోలు : మండలంలోని కొండపర్తి ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీని బుధవారం ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు సుకుమార్ తెలిపారు. అధ్యక్షుడిగా కట్కూరి విష్ణు, ఉపాధ్యక్షుడిగా పోలెపాక రాజేశ్, ప్రధాన కార్యదర్శిగా వస్కుల వివేక్, కార్యదర్శులుగా బొక్కల నరేష్, కట్కూరి హరీష్‌తో పాటు సహాయ కార్యదర్శి, ప్రచార కార్యదర్శి, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.